## క్లుప్తంగా

### మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ



నేతాజీనగర్‌లో వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

ఏలూరు టౌన్ : ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్ నేతాజీనగర్ నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో కొత్తగా విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ పనులను కార్పొరేటర్ శ్రీనివాస్ శనివారం పర్యవేక్షించారు. సమస్యపై సత్వరమే స్పందించి లైట్లు ఏర్పాటు చేయిస్తున్న సచివాలయ కన్వీనర్ ఎంబీ కుమార్, కార్పొరేటర్ శ్రీనివాస్‌లకు నేతాజీనగర్ కమిటీ, స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### రాజా అహ్మద్‌కు సన్మానం



రాజా అహ్మద్‌ను సన్మానిస్తున్న అంజుమన్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీ మైనార్టీ ఏలూరు జిల్లా నాయకుడిగా నియమితులైన వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ రాజా అహ్మద్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంజుమన్ మాజీ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, షేక్ మస్తాన్ బాషా, ఎండీ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య సేవలు

ఏలూరు రూరల్: ఏలూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో 218 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించామని ఆశ్రం వైద్య కళాశాల సీఈఓ డాక్టర్ కె హనుమంతురావు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రామచంద్రరావుపేట హెల్త్ సెంటర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి, 115 మందికి ఈసీజీ, 82 మందికి 2డి ఎకోస్, 137 మంది జీఆర్‌బీఎస్ మరో 47 మంది స్త్రీలకు కంటి తదితర పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు.

# గుడివాకలంక.. అభివృద్ధి చకచకా

- శరవేగంగా పనులు
- మూడేళ్లలో రూ.4.53 కోట్లు మంజూరు

ఏలూరు రూరల్: కొల్లేరు రాజకీయాలకు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా ఉంది గుడివాకలంక గ్రామం. కొల్లేరు ప్రజలు చేపట్టిన చేపల సాగు, వ్యాపారం, కొల్లేరు ప్రక్షాళన, భూముల పంపిణీ, కాంటూరు కుదింపు తదితర అంశాలకు గుడివాకలంక కేంద్రంగా ఉన్న విషయం విధితమే. ఈ గ్రామ ప్రజలు కట్టుబాట్లు అనుసరిస్తూ ఉమ్మడిగా చేపల సాగు, వ్యాపారంతో ఆర్థికంగా బలపడ్డారు. గుడివాకలంక గ్రామంలో రూ.4.53 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా ముందుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో గుడివాకలంకను మండల కేంద్రంగా మార్చుతారని ప్రజలు భావిస్తున్నారు.

**మారిన ముఖ చిత్రం**

ఏలూరు మండలం 21 గ్రామ పంచాయతీలతో ఎక్కువ జనాభా గల మండలంగా పేరొందింది. 2021 సంవత్సరం తర్వాత శనివారపుపేట, సత్రంపాడు, తంగెళ్లమూడి, చొదిమెళ్ల, కొమడవోలు, పోణంగి, వెంకటాపురం ప్రధాన గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. ఫలితంగా మండల గ్రామాల సంఖ్య 15 తగ్గింది. మిగిలిన పైడచింతపాడు, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, మొండికోడు, పెదయాగనమిల్లి, కోమటిలంక గ్రామాలకు గుడివాకలంక కేంద్ర బిందువుగా మారుతోంది.



గుడివాకలంకలో అభివృద్ధి చేసిన తాగునీటి చెరువు



హైస్కూల్ అభివృద్ధి పనులకు దిగుమతి చేసిన మెటల్

**అభివృద్ధిలో ముందంజ**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు గుడివాకలంక గ్రామానికి రూ.4.53 కోట్లు మంజూరు చేసింది. వీటితో రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నారు. గ్రామంలో 30 ఎకరాలకు పైగా తాగునీటి చెరువులు ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం పీహెచ్‌సీ భవనం అభివృద్ధి చేసింది. కొల్లేరు గ్రామాల ప్రజలు ఇక్కడే వైద్య సేవలు పొందుతున్నారు. తాజాగా ప్రభుత్వం రూ.4 కోట్ల విలువ గల విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. ఇక్కడ పక్షుల విడిది కేంద్రం ద్వారా పర్యాటక రంగం అభివృద్ధి కానుంది. జడ్పీ పాఠశాలలో రూ.2.12 కోట్లతో తరగతి గదులు నిర్మిస్తున్నారు. ఈ పాఠశాలను జూనియర్ కళాశాలగా రూపుదిద్దుతారని ప్రజలు భావిస్తున్నారు.

**అన్ని రంగాల్లో రాణించాలి**



లక్షలాది కొల్లేరు ప్రజల గొంతు వినిపించడానికి ఒక కేంద్రం కావాలి. అది గుడివాకలంక అయితే ఎంతో సంతోషిస్తాం. మారుతున్న ప్రపంచంతో మా పిల్లలు కూడా ఉన్నత విద్యావంతులు కావాలి. భవిష్యత్తులో కొల్లేరు గ్రామాల పిల్లలు అన్ని రంగాల్లో అవకాశాలు అందుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలి. అన్నింటికీ కొల్లేరు నుంచే నాంది పలకాలి. అదే మా లక్ష్యం.

– జయమంగళ రామారావు, మాజీ ఎంపీపీ

**పథకాలతో ఆర్థిక భరోసా**



ప్రభుత్వం కోట్ల రూపాయలు విడుదల చేస్తోంది. గ్రామంలో మౌలిక వసతులు పెద్ద ఎత్తు అభివృద్ధి చెందుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలి. గుడివాకలంక కొల్లేరు ప్రజల అవసరాలు తీర్చే ప్రధాన గ్రామం కావాలన్నదే మా కోరిక. సీఎం జగన్ అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు ద్వారా గ్రామ ప్రజల ప్రజలు ఆర్థికంగా బలపడుతున్నారు.

– ఘంటసాల రుక్మాంగధ మహరాజు, ఉపసర్పంచ్

### యాజమాన్యానిదే పూర్తి బాధ్యత

ఏలూరు (టూటౌన్): చింతలపూడి మండలం వెలగలపల్లి కేఎంఆర్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించి గాయపడ్డ గణిజెర్ల గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మరియమ్మకు వైద్య చికిత్స అందించాలని, ఆస్పత్రి ఖర్చులు, నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ, చింతలపూడి మండల అధ్యక్షుడు సత్తా వెంకటేశ్వరరావులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఫ్యాక్టరీలో మహిళలకు కావాల్సిన సదుపాయాలన్నీ కల్పించాలని, అంబులెన్స్ ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు.

### నేడు డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ది.ఏలూరు జిల్లా వెండి, బంగారం అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన ప్రథమ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక అగ్రహారంలోని సీతారాం భర్తియా కల్యాణ మండపంలో ఉదయం 10. 30 గంటలకు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ హాజరౌతారని తెలిపారు.

# ఇంటి ముందు ప్రభుత్వం.. కంటి ముందు పాలన

- ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం
- ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఇంటి ముందు ప్రభుత్వం కంటి ముందు పాలన విధానంతో ఏలూరు సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు, ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. శనివారం ఆయన తన చాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి ఉన్నారు.

**సచివాలయాల్లోనే జనన, మరణ నమోదు**

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 79 సచివాలయాల్లో ఇకపై జనన, మరణాల నమోదు చేపడతామని వెంకటకృష్ణ కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో జనన నమోదు ఆన్‌లైన్‌లో జరుగుతుందని, ఇంటివద్ద ప్రసూతి ఐతే.. అటువంటి చిన్నారుల జనన నమోదుకు సచివాలయాల్లోని శానిటరీ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలను సంప్రదించాలని అన్నారు. బిడ్డ పుట్టిన 21రోజుల్లోపు ఐతేనే సచివాలయాల్లో నమోదు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. జనన నమోదుకు సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ధ్రువీకరణ పత్రాన్ని సచివాలయంలోనే తీసుకునే అవకాశం ఉందని కమిషనర్ చెప్పారు.



ప్లాస్టిక్ నిషేధ సంబంధిత పోస్టర్‌ను చేపుతున్న కమిషనర్ వెంకటకృష్ణ, ఎంహెచ్‌ఓ మాలతి

**జవాబుదారీ తనానికి నోడల్ ఆఫీసర్**

సచివాలయాల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని కమిషనర్ చెప్పారు. నగరంలోని 50 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. వీరంతా ఉదయం 9 గంటల నుంచి డివిజన్లలో పర్యటిస్తూ నగరపాలక సంస్థ సిబ్బందిని సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

**ప్లాస్టిక్ రహిత నగరంగా ఏలూరు**

కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఏలూరు నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. 100 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులేవీ వినియోగించేందుకు అనుమతి లేదన్నారు. నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులు, థర్మాకోల్ ప్లేట్లు, ప్లాస్టిక్ స్పూన్లు, గ్లాసులు, విస్తర్లలో సిల్వర్ కవర్ ఉన్నవి ఇలా పలు రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించామని చెప్పారు.

**పోస్టర్లు అంటిస్తే జరిమానా**

ఇళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయ గోడలు, బ్రిడ్జిలు ఇలా ఎక్కడైనా పోస్టర్లు అంటిస్తే జరిమానా తప్పదని కమిషనర్ హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని సినిమా థియేటర్ల యాజమాన్యాలకు అవగాహన కల్పించామన్నారు. ఫ్లెక్సీ, పోస్టర్ల ప్రింటర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 5న ప్రారంభమైన రామకోటి మహోత్సవాలు శనివారం ముగిశాయి. మూడు వారాల పాటు నగర ప్రజలకు ఆధ్యాత్మిక అనుభవాన్ని అందించాయి. ఉత్సవాల ముగింపు రోజు ఉదయం ప్రత్యేక పూజల అనంతరం విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన సంస్కృత పండితుడు మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి హరిద్వార్ దాసభారతి ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ పరాయితం నారాయణాచార్యులు భాగవతార్ భక్త శబరి అనే అంశంపై నిర్వహించిన హరికథా గానం అలరించింది. స్వామి వారికి పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న విశ్వశాంతి సమాజం ప్రతినిధులు

# డీఎస్‌ఈఓను కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వీ రవి సాగర్‌ను వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘంగా పరిపాలనాంశాల్లో తమ సంఘం విద్యాశాఖకు సహకరిస్తుందని చెప్పారు. దీనిపై రవిసాగర్ స్పందిస్తూ తన పరిధిలో సమస్యలేమైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తానని, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారు. సందర్భంగా రవిసాగర్‌కు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు గెడ్డం సుధీర్, జిల్లా నాయకులు వి.రామ్మోహనరావు, అనిల్ తదితరులున్నారు.



డీఎస్‌ఈఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

# గన్నవరం అల్లర్లకు టీడీపీదే బాధ్యత

ఏలూరు (టూటౌన్): గన్నవరంలో జరిగిన అల్లర్లకు టీడీపీ బాధ్యత వహించాలని జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు కోరారు. షెడ్యూల్డ్ క్యాస్ట్‌కు చెందిన సీఐ పోగిరి కనకారావుపై టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన వారిపైనా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, అధికార ప్రతినిధి పట్టాభిలపైనా అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెడితే దానికి వ్యతిరేకంగా కోర్టులో పిల్ వేసి అడ్డుకున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అని దుయ్యబట్టారు. జాతీయ ఎస్సీ కమిషన్‌కు రాసిన లేఖలో పసలేని టీడీపీకి చెందిన వర్ల రామయ్య ఆరోపించడం దారుణమన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2024లో వైఎస్ జగన్‌ను తిరిగి సీఎం చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా అండగా ఉంటారని పెరికె పేర్కొన్నారు.

### కాంగ్రెస్ ప్లీనరీలో జిల్లా నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో నిర్వహిస్తోన్న జాతీయ కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాల్లో ఏలూరు జిల్లా నాయకులు పాల్గొన్నారు. జిల్లాలో అమలు చేస్తోన్న పార్టీ కార్యక్రమాలను జాతీయ, రాష్ట్ర నాయకులకు వివరించామని పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తెలిపారు. ప్లీనరీలో కైకలూరు అసెంబ్లీ పార్టీ ఇన్‌చార్జి మంగినేని బాబ్జి తదితర నాయకులతో ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును కలిశామని శనివారం ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు.

# గ్రామీణులకు మేలు చేసే ఆవిష్కరణలు చేయాలి



చొదిమెళ్లలో రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ఏలూరు రూరల్: గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే అవిష్కరణలు చేపట్టాలని ఏలూరు ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమార్ రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు శనివారం చొదిమెళ్ల భరోసా కేంద్రం వద్ద రైతుల భాగస్వామ్య గ్రామీణ ఆవస్యకత అనే అంశంపై సమావేశం నిర్వహించారు. గోదావరి జోన్ ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాస్, ఉండి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎస్ మల్లికార్జునరావు, మండల వ్యవసాయశాఖాధికారిణి ఎ.జీవనసంధ్య విచ్చేశారు. పలువురు రైతుల సమస్యలకు అధికారులు పలు సూచనలు చేశారు. విద్యార్థులు గ్రామ పఠం రూపొందించి అభివృద్ధి, వ్యవసాయంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ వాసవిసౌజన్య, టి.స్వర్ణలత, రైతులు ఎ.వరప్రసాద్, ఎం.రామకృష్ణ, ఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ సీహెచ్ సురేంద్ర మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. సివిల్స్ సాధించడానికి నిరంతరం ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు చదవాలని సూచించారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 24 | అరటి కాయ (1) | 05-07 |
| వంకాయలు (గులాబీ) | 18 | చిక్కుడు కాయలు | 32 |
| వంకాయలు (కాంతులు) | 30 | చామదుంపలు | 54 |
| వంకాయలు (తెలుపు) | 24 | ములక్కాడలు | 12-15 |
| బెండకాయలు | 44 | కంద | 46 |
| పచ్చిమిర్చి | 20 | బీట్‌రూట్ | 30 |
| కాకర కాయలు | 30-36 | కీరా దోస | 30 |
| బీరకాయలు | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 56 |
| బీరకాయలు (పందిరి) | 54 | అల్లం | 70 |
| క్యాబేజీ | 16 | కొత్తిమీర (కట్ట) | 13 |
| క్యారెట్ | 24 | పాలకూర | 08 |
| దొండకాయలు | 24-28 | చుక్కకూర | 08 |
| బంగాళదుంపలు | 18 | తోటకూర | 08 |
| ఉల్లిపాయలు | 18 | గోంగూర | 08 |
| గోరుచిక్కుడు | 40 | పుదీనా | 05 |
| దోసకాయలు | 44 | బఠాణీ | 48 |
| అనపకాయ (1) | 20 | క్యాప్సికమ్ | 56 |
| పొట్లకాయ(1) | 20 | చిలకడదుంప | 26 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 14 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర) | 21.00 | 09 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 28 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 37 |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 04 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 02 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 04 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 23 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 14 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 22.15 | 34820 | 03 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 09.00 | 4794 | 32 |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 34 |
| ఏలూరు -విశాఖపట్నం | 22.00 | 4838 | 34 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 33 |

# ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

దెందులూరు: జగనన్న ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. శనివారం చల్లచింతలపూడిలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో గృహనిర్మాణ శాఖ దెందులూరు మండల ఏపీ కావ్య ఆధ్వర్యంలో హౌసింగ్ డే నిర్వహించారు. మండల పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ చౌదరి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు కాలనీల్లోనే గోడౌన్లను ఏర్పాటు చేసి నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచారన్నారు. లబ్దిదారులంతా త్వరతగతిన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఏపీఓ దశరదరాంజీ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రాజు, వీఆర్‌ఓ చంద్రం, లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.



చల్లచింతలపూడి హౌసింగ్ డే నిర్వహిస్తున్న తహశీల్దార్ నాంచారయ్య

### మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు: స్థానిక కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు, మినుముల కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. దెందులూరు సమీప గ్రామాల రైతులు పెసలు, మినుములను ఈ మార్క్‌ఫెడ్ కేంద్రంలో విక్రయించాలని సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు కోరారు. రైతుల సౌకర్యార్థం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉన్నతాధికారులతో మాట్లాడి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని గణపతిరావు కోరారు.

# విపక్షాల అసత్య ఆరోపణలు తిప్పికొట్టాలి

పెదవేగి : జగనన్న పాలనలో మేలును ప్రజలకు వివరిస్తూ, విపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న కుట్రలను, అసత్య ఆరోపణలను తిప్పికొట్టాల్సిన బాధ్యత గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లపై ఉందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శనివారం పెదవేగి మండలం తురాయి చెట్టు సమీపంలో నిర్వహించిన పెదవేగి, గార్లమడుగు, లక్ష్మీపురం, కొప్పులవారిగూడెం, న్యాయంపల్లి, కూచింపూడి, రామశింగవరం సచివాలయాలకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణుల సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి విషయంలో సరికొత్త చరిత్రను సృష్టించారని అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయడానికి, ప్రజలకు దగ్గరయ్యే అవకాశం కల్పించారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలను, ఆశయాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులకు ఏదైనా కారణాలతో సంక్షేమ పథకాలు అందకపోతే వారి సమస్యను పరిష్కరించి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. మార్చి 18 నుంచి 25 వరకు ఇంటింటికీ గృహ సారథులు వెళ్లి వారికి ప్రభుత్వం అందించే పథకాలను వివరిస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించాల్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతోనే సచివాలయ వ్యవస్థను సీఎం జగన్ ప్రవేశపెట్టారని అన్నారు. ప్రజలను ఓటు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. పెదవేగి సొసైటీ అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జి ప్రసాద్, ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, ఎంపీటీసీ యర్రా సలోమి, పోకల రాంబాబు, తాతా మురళి, తాతా సత్యనారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులను స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి